www.vishalabharati.com
epaper:vishalabharati.com

TELANGANA POLITRICKS

పాలిట్రిక్స్ 2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily
మంగళవారం, 12.09.2023
హైదరాబాద్
1.00 pm edition

పాలిట్రిక్స్



ఎలక్షన్ జోష్‌కు..

'జమిలి' బ్రేక్!

గ్రేటర్ సెగ్మెంట్లలో తగ్గిన పార్టీల లీడర్ల దూకుడు

స్పీడ్ తగ్గించిన బీఆర్ఎస్ పార్టీ క్యాండిడేట్లు

సొంత ఇమేజ్ పెంచుకునే పనిలో ఆశావహులు

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల లిస్ట్ ఆలస్యమయ్యే అవకాశం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి :

వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగాలని ఆయా పార్టీల అభ్యర్థిత్వం ఆశిస్తున్న నేతలకు 'మినీ జమిలి' ఎన్నికల ప్రచారం బ్రేకులు వేసింది. ఆయా పార్టీల నుంచి ఆయా నియోజకవర్గాలలో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న ఆశావహులు గడిచిన కొద్ది రోజులుగా స్పీడ్ తగ్గించారు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీకి ఈ ఏడాది డిసెంబర్‌లో జరగాల్సిన ఎన్నికలు జరుగుతాయా..? లేదా.. మోడీ సర్కార్ తీసుకునే నిర్ణయాన్ని బట్టి వచ్చే ఏప్రిల్, లేదా అంతకు ముందు జరుగుతాయా? ఆలోచనలో ఆశావహులు ఉన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్దామని పలువురు ఆశావహులు ఆలోచిస్తున్నారు.

పార్టీల నాయకత్వం సైతం అభ్యర్థులు జాబితా ఇప్పట్లో ప్రకటించే అవకాశాలు లేకపోవడంతో ఆశావహులు డీలా పడ్డారు. గ్రేటర్ పరిధిలోని 12 కీలక నియోజకవర్గాలు ఎల్బీనగర్, ఉప్పల్, ఇబ్రహీంపట్నం, సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్ నగర్ తదితర సెగ్మెంట్ల నుంచి బీఆర్ఎస్‌పార్టీ తరఫున బరిలో దిగే అభ్యర్థులను ఆ పార్టీ హైకమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ఈ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి టికెట్లు కోసం పోటీ నెలకొన్నది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ టికెట్ల కోసం ఆయా నియోజకవర్గాల్లో పలువురు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. పార్టీ హైకమాండ్ దృష్టిలో పడేందుకు గడిచిన కొద్ది నెలలుగా ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. పార్టీ పిలుపు మేరకు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సొంతంగా ఎవరికి వారు వివిధ కార్యక్రమాలు చేపడుతూ సొంత ఇమేజ్ పెంచుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొందరు కాంగ్రెస్‌నేతలు పాదయాత్రలు కూడా చేస్తున్నారు.

నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ స్థానికంగా తాము గట్టిపట్టు కలిగి ఉన్నామని సందేశం హైకమాండ్‌కు చేరాలని తాపత్రయపడుతున్నారు. దీనికోసం కొందరు ఆశావహులు పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెడుతూ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఒక్కసారి పార్టీ టికెట్ ప్రకటన వచ్చిన తర్వాత ఖర్చు కొంత పార్టీ చూసుకుంటుంది. అందుకే ప్రస్తుతం పార్టీ టికెట్ దక్కించుకోవడంపై దృష్టి సారిస్తూ ముందుకు సాగారు. పార్టీ హైకమాండ్ ఏ క్షణంలోనైనా క్యాండిడేట్ల లిస్ట్ ఖరారు చేయవచ్చన్న ఆలోచనతో రేయింబవళ్లు ప్రజల్లో ఉంటూ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే తాజాగా మోడీ ప్రభుత్వం 'మినీ జమిలి' నిర్వహణపై ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో చాలామంది ఆశావహులు డీలా పడ్డారు. పార్లమెంటు సమావేశాల్లో మోడీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో? చూసిన ఆ తర్వాత దూకుడు కొనసాగించాలా? లేదా అనే విషయం ఆలోచన చేద్దామన్న నిర్ణయానికి వచ్చారు. అందుకే ఏదో నామమాత్రంగా ప్రజల్లో ఉంటూ తమ ఉనికిని చాటుకుంటున్నారు. మొత్తానికి 'మినీ జమిలి' ఎన్నికల ప్రచారం గ్రేటర్‌రాజకీయాల్లో లీడర్ల దూకుడుకు బ్రేకులు వేసిందనే చెప్పాలి.



ప్రజల మనిషికి పుట్టిన రోజు

శుభాకాంక్షల వెల్లువ

చామ విజయ శేఖర్‌రెడ్డి బర్త్‌డేకు ఘనంగా ఏర్పాట్లు

విశాల భారతి, హైదరాబాద్:

కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత చామ విజయ శేఖర్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ప్రజల మనిషి, పేదల లీడర్‌గా పేరున్న శేఖర్‌రెడ్డి కి ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో వేడుకలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అజాత శత్రువుగా పేరున్న విజయ శేఖరుడికి కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా విశాల భారతి పత్రికా యాజమాన్యం కూడా విజయ శేఖర్‌రెడ్డికి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపింది.

బీఆర్ఎస్ టికెట్లపై ఆ పార్టీ లీడర్ల అసంతృప్తి కొనసాగుతోంది. టికెట్‌దక్కని ఆశావహుల్లో ఆక్రోశం రోజు రోజుకు పెల్లుబుకుతోంది. ఇప్పటికైనా అభ్యర్థులను మార్చి తమకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీల నేతలు పట్టుబట్టుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌నియోజకవర్గాల్లో కీలకమైన నియోజకవర్గాల్లో ఒకటైన ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిపై సొంత పార్టీ నేతలే తిరగబడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ ఎత్తులతో సతమవుతున్న దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బీఆర్ఎస్‌నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ షాక్‌ఇచ్చారు. సుధీర్‌రెడ్డిని మార్చకపోతే తన భార్య లక్ష్మీ ప్రసన్ననను బరిలోకి దింపుతానని ప్రకటించారు. ఆయనతో పాటు స్థానిక లీడర్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కూడా సుధీర్‌రెడ్డికి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్నారు.

సుధీర్‌రెడ్డికి షాక్..!

ఎల్బీనగర్ గులాబీ కోటలో రగులుతున్న అసమ్మతి సెగలు

ఎమ్మెల్యేపై తిరగబడుతున్న సొంత పార్టీ నేతలు

బహిరంగంగానే ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ విమర్శలు

తన సతిమణీని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలుపుతానని ప్రకటన

ఆయన బాటలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ లీడర్లు

కాంగ్రెస్‌కు గెలుపునకు కలిసొచ్చేలా బీఆర్ఎస్ నేతల తీరు..

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

ఎల్బీనగర్‌బీ ఆర్ఎస్ లో అసమ్మతి జ్వాలలు రచ్చకెక్కాయి. బీఆర్ఎస్‌అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మార్చాలంటూ ఆ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ డిమాండ్‌చేస్తున్నారు. సోమవారం ఆయన ఏకంగా ప్రెస్‌మీట్ పెట్టి సుధీర్‌రెడ్డి తీరుపై పలు విమర్శలు చేశారు. సొంత పార్టీ నాయకులకే సుధీర్‌రెడ్డి వెన్నుపోట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతనే వేల కోట్ల భూములు ఆక్రమించారని ఆరోపించారు. ఎమ్మెల్యే విధానాల వల్ల పార్టీకి తీవ్రంగా నష్టం జరుగుతోందన్న ఆవేదన తప్పా.. బీఆర్ఎస్‌పార్టీపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని రామ్మోహన్‌గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రం మొత్తంలో అత్యధికంగా పార్టీ మెంబర్‌షిప్‌చేసిన ఘనత తమదేనన్నారు. అలాగే జీహెచ్ఎంసీలో 11 మంది గెలిపించిన ఘనత కూడా తనకే దక్కిందన్నారు. గత ఎన్నికల్లో 2 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి తమ ఆస్తులను కోల్పోయామని ఈ సారి తన సతీమణి లక్ష్మీ ప్రసన్న ఎన్నికల్లో బరిలో నిలుస్తుందని రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్‌లో ప్రజల మద్దతు, సర్వేలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని, పార్టీ అవకాశం ఇస్తే గెలిచి తీరుతామని స్పష్టం చేశారు. అభ్యర్థిని మార్చకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సుధీర్‌రెడ్డికి సహకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

పదేండ్లుగా వర్గపోరు..

2014లో ఇక్కడ టీడీపీ గెలవగా, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్- టీడీపీ పొత్తులో పోటీ చేయగా.. కాంగ్రెస్ నుంచి సుధీర్ రెడ్డి పోటీ చేసి గెలిచారు. ఇక గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పోటీ చేసి ఓడిపోతున్నారు. అయితే కాంగ్రెస్ నుంచి గెలిచిన సుధీర్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి రావడంతో సీన్ మారింది. అప్పటి నుంచి వర్గపోరు రగులుతూనేఉంది. తాజాగా కేసీఆర్‌ముందస్తుగా సీట్లు ప్రకటించడం, సీటుని మళ్లీ సుధీర్ రెడ్డికే కేటాయించడంతో రామ్మోహన్ అసంతృప్తితో ఉన్నారు.

కాంగ్రెస్‌కు కలిసొచ్చేలా రాజకీయం..

సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికే టికెట్ రావడంతో రామ్మోహన్‌గౌడ్ నిరాశ చెందారు. రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయి ఈ సారి ఎలాగైనా గెలవాలనే పంతం పెట్టుకున్న ముద్దగౌనికి అసలు టికెట్టే రాకపోవడంతో అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో సుధీర్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా అడుగులు వేసిన కాంగ్రెస్‌రామ్మోహన్ గౌడ్ కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు ఆహ్వానం పలికిందని ప్రచారం జరిగింది. కానీ అవన్నీ అబద్దాలే అని ఆయన కొట్టిపారేశారు. ముఖ్యంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బలం, బలహీనతలేమిటో కాంగ్రెస్ హైకమాండ్‌కు పూర్తిగా తెలుసు. అందుకే అతడిని ఎదుర్కొనే సమర్థుడైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారు. ఎల్బీనగర్ టికెట్ కోసం నిజామాబాద్‌కు చెందిన మధు యాష్కీ దరఖాస్తు చేసుకున్నారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు షురూ అయిన రోజే గాంధీభవన్ గోడలపై మధు యాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. సుధీర్ రెడ్డే ఈ పోస్టర్లు వేయించాడని మధు యాష్కీ ఆరోపించగా.. సుధీర్ రెడ్డి వాటిని కొట్టి పారేశారు. కాంగ్రెస్ పార్టీలో ఇంకా అభ్యర్థులు ఖరారు కాకుండానే అక్కడ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పొలిటికల్‌వార్ మొదలైపోయింది.

మధు యాష్కీ అంతగా చరిష్మా , స్థానికంగా పరిచయం ఉన్న నాయకుడు కూడా కాదు. అతడికి టికెట్ ఇస్తే కాంగ్రెస్ పార్టీ గెలవడం కష్టమని ఇప్పటికే కొంత మంది రాష్ట్రనాయకత్వానికి కంప్లైంట్ చేసినట్లు తెలుస్తున్నది. ఆర్థికంగా బలంగా ఉండి, స్థానికంగా పరిచయం ఉన్న నాయకులకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే ఎల్బీనగర్ టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు కూడా తెలుస్తోంది. ఇప్పటికే తమ్ముడి కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైకమాండ్ వద్ద లాబీయింగ్ కూడా చేశారని, రాజగోపాల్ రెడ్డికి టికెట్ కూడా కన్ఫార్మ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎల్బీనగర్‌లో నల్గొండ జిల్లాకు చెందిన సెటిలర్ల ఓటర్లు భారీగా ఉండడం, అందులోనూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు కూడా ఎక్కువగా కలిసి వస్తుందని, ఆర్థికంగా రాజగోపాల్ రెడ్డి సౌండ్ పార్టీనే కావడంతో ప్లాన్‌వేసినట్లు తెలుస్తోంది. సుధీర్ రెడ్డిని ఎదుర్కోవడానికి రాజగోపాల్ రెడ్డే కరెక్ట్ అనే చర్చ కూడా సాగుతోంది.

మరోవైపు జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఎప్పటి నుంచో గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. సుధీర్ రెడ్డి పార్టీని వదిలి వెళ్లిన దగ్గర నుంచి ఎల్బీనగర్ కాంగ్రెస్‌కు జక్కిడి ప్రభాకర్ రెడ్డే పెద్ద దిక్కుగా మారారు. తనకు ఈ సారి తప్పకుండా టికెట్ వస్తుందని చాలా ఆశ పెట్టుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గం మొత్తం ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ తరఫున పోస్టర్లు అతికించి ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున గత రెండు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రామ్మోహన్ గౌడ్‌కు ఈ సారి టికెట్ నిరాకరించారు. ఎల్బీనగర్‌లో ఇప్పటి వరకు బీఆర్ఎస్ ఏనాడూ గెలవక పోవడం కూడా సుధీర్‌రెడ్డికి కొంత ప్రతికూలాంశమే.. ఎన్నికల షెడ్యూల్‌లో ఎల్బీనగర్‌రాజకీయం ఎటువైపు టర్న్‌తీసుకుంటుందో చూద్దాం

స్థానిక లీడర్లు, కార్పొరేటర్లదీ అసమ్మతి గళమే..

బీజేపీ హస్తినాపురం కార్పొరేటర్ గా గెలిచిన బానోతు సుజాత నాయక్ కేటీఆర్‌పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరారు. నాటి నుంచి తాను ఎల్బీనగర్‌నియోజకవర్గమైనా సుధీర్‌రెడ్డి ఏనాడు తమను పట్టించుకోలేదని సుజాతనాయక్‌ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అడుగడుగునా ఇబ్బందులు సృష్టిస్తున్నారని వాపోయారు. ఎల్బీనగర్‌లో ఒకసారి మహిళా అభ్యర్థిగా ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్‌కు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్‌హైకమాండ్‌ను కోరారు. అలాగే సామ రమణారెడ్డి, వజీర్‌ప్రకాశ్‌గౌడ్‌దేవిరెడ్డికి వ్యతిరేకంగా తమ గళం వినిపించారు. ఆయనను ఎట్టి పరిస్థితుల్లోనూ మారిస్తేనే పార్టీకి మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు.

'పాలమూరు' చుట్టూ రాజకీయాలు!

40 శాతం మాత్రమే పూర్తయిన ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు

అయినా ప్రారంభించి పొలిటికల్ మైలేజ్ కొట్టేయాలని కేసీఆర్ ప్లాన్

ఓట్ల కోసమే ప్రారంభోత్సవ డ్రామా అంటున్న కాంగ్రెస్, బీజేపీ

ప్రభుత్వ ఖర్చుతో ఎన్నికల ప్రచారమా? అంటూ విమర్శలు

ఓట్ల కోసం సీఎం కొత్త నాటకం ఆడుతున్నారని ధ్వజం

విశాల భారతి, హైదరాబాద్:

రాష్ట్రంలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై అన్ని పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. సగం కూడా పూర్తి కాని ఈ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ఈ నెల 16న ప్రారంభిస్తున్నారని అధికారిక ప్రకటన విడుదల కావడంతోనే వివాదం మొదలైంది. 40 శాతం పనులు పూర్తి కాని ప్రాజెక్టును సీఎం ప్రారంభిస్తున్నారని విపక్ష పార్టీలు బీఆర్ఎస్ పై విరుచుకుపడుతున్నాయి. అసంపూర్తి దశలో ఉన్న ప్రాజెక్టును ప్రారంభించి ఓట్లు దండుకోవడం కోసమే కేసీఆర్ కొత్త డ్రామాకు తెర లేపారని కాంగ్రెస్, బీజేపీల నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

ప్రాజెక్టు చుట్టూ అనేక ప్రశ్నలు

ఈ ప్రాజెక్టు పనులు 40 శాతం కూడా పూర్తి కాలేదని, అలాంటి ప్రాజెక్టును ప్రారంభించి నీటిని ఎక్కడకు తరలిస్తారని ఆయా పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ప్రారంభించే నార్లాపూర్ వద్ద 9 పంపులకు ఒకే పంపు పనులు పూర్తికావడం, అదే మోటార్ పంప్‌ను ఆయన ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా.. అధికార పార్టీ వెనక్కు తగ్గేదే లే అంటూ ముందుకే అడుగులు వేస్తున్నది. దీంతో ఈ ప్రాజెక్టు అధికార, విపక్ష పార్టీలకు రాజకీయ వేదికగా మారింది. తెల్లారే సెప్టెంబర్ 17 ఉండడంతో పాలమూరు ప్రాజెక్టుతో బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నట్లు విమర్శలు కూడా ఉన్నాయి.

ఓట్ల కోసం కొత్త నాటకమా?

ప్రాజెక్టు పనులు పలు దశల్లో ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిని పూర్తి చేసే సోయి లేని సీఎం కేసీఆర్.. ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేస్తానని అనడం చూస్తే సిగ్గు అనిపిస్తుందని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. కానీ ఇవేవి పట్టని గులాబీ బాస్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నారు. ప్రధాన కాలువల పనులు అసంపూర్తిగా ఉన్నా, ప్రాజెక్టును కేసీఆర్ ప్రారంభించడం చూస్తే, ఓట్ల కోసం కొత్త నాటకం ఆడుతున్నారని అర్థమవుతోందని వారు ధ్వజమెత్తుతున్నారు. ఆయన ఎన్ని నాటకాలు ఆడినా.. తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రజలు ఆ పార్టీని నమ్మేందుకు సిద్ధంగా లేరని విపక్షాల నేతలు బల్లగుద్ది చెబుతున్నారు.

నీరు ఎక్కడికి పోవాలి?

నార్లాపూర్ పంప్ హౌస్ లో తొమ్మిది మోటార్ల కు ఒక్కటి మాత్రమే పూర్తి అయ్యిందని, సీఎం కేసీఆర్ ఆ ఒక్కమోటర్ ప్రారంభించి నీరు విడుదల చేస్తే.. ఆ నీరు ఏదుల, వట్టెం, కరివెన జలాశయాల్లోకి రావాల్సి ఉంటుంది. కానీ ఆ జలాశయాల్లోకి రావాలంటే ప్రధాన కాలువల పనులే పూర్తి కాలేదని విపక్ష నేతలు ప్రధానంగా ఎత్తిచూపుతున్నారు. సీఎం కేసీఆర్ ఓట్లు దండుకోవడం కోసం ఎన్ని జిమ్మిక్కులైనా చేస్తారని విమర్శిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బొందపెట్టేందుకు ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని, విషయం తెలుసుకున్న కేసీఆర్ ఇక్కడి ప్రజలను ఆకట్టుకునేందుకు, మరోసారి వారిని మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విపక్షాలు విరుచుకుపడుతున్నాయి.

కావాలనే రాద్ధాంతమా?

ఇదిలా ఉండగా.. అధికార పార్టీ నేతలు మాత్రం తమ బాస్ కు అనుకూలంగా ప్రకటనలు చేస్తున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు తో ఉమ్మడి పాలమూరు జిల్లా లోని పలు ప్రాంతాలు సస్యశ్యామలంగా మారుతాయని ప్రగల్భాలు పలుకుతున్నారు. సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ను ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లాలకు తాగునీరు అందుతుందని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే, ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే ఎందుకు ఇంత ఆదరాబాదరగా ప్రారంభోత్సం అంటే మాత్రం నీళ్లు నములుతుండటం గమనార్హం.

ప్రజలు నవ్వుకుంటున్నారా?

మరో మూడు నెలల్లో వారి అధికారం ముగియనుండగా.. అతి త్వరలో ప్రాజెక్టు కాల్వలను, పనులను పూర్తి చేసి బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని అధికార పార్టీ ప్రకటనలపై ప్రజలు నవ్వుకుంటున్నారని విపక్షాల నేతలు అంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని, ఓట్ల కోసమే ప్రారంభిస్తున్నామనే విమర్శలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీ లకు ప్రజలే బుద్ధి చెప్తారని అధికార పార్టీ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకేనా?

ప్రాజెక్టు ఎక్కడి పనులు అక్కడ పెండింగ్ లో పెట్టి, ప్రారంభానికి సీఎం కేసీఆర్ ఏం మొహం పెట్టుకుని వస్తున్నారని దక్షిణ తెలంగాణకు చెందిన నేతలు అంటున్నారు. ప్రాజెక్టు పేరుతో అధికార పార్టీ ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందంటున్నారు. ఈ ప్రాజెక్టులో రూ.వందల కోట్లు కొల్లగొట్టిన కేసీఆర్ దండుపాళ్యం ముఠాకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్, బీజేపీ నేతలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు సందర్శనకు వెళ్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకున్నదని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ డొల్ల తనం బయట పడుతుందనే భయం వారిలో ఉందని వారంటున్నారు.